Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in
సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

బుధవారం 23/09/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## అధికారులను అప్రమత్తం చేసిన సీఎం



**టీ మీడియా,సెప్టెంబర్ 22, హైదరాబాద్:** నగరంలో వర్షాల దృష్ట్యా మున్సిపల్ కమిషనర్లు, హైడ్రా, పోలీసు కమిషనర్లను, తదితర అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిఅప్రమత్తం చేశారు. సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. రోడ్లు, జంక్షన్లు, కాలనీల్లో వర్షపు నీరునిలవకుండా చర్యలు చేపట్టాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న కాలనీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నాలాలు, డ్రైనేజీల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలని ఆయన పేర్కొన్నారు.

# ఇరాన్‌పై అమెరికా కొత్త అస్త్రం

**⏭ విమానాలపై ప్రపంచవ్యాప్తంగా ఆంక్షలు**

**టీ మీడియా,సెప్టెంబర్ 22, ఢిల్లీ బ్యూరో :** పశ్చియాసియా యుద్ధం నేపథ్యంలో ఇరాన్‌ను దెబ్బతీసేందుకు అగ్రరాజ్యం అమెరికా కొత్త ఎత్తుగడలు వేస్తోంది. దొరికిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకుని ఇరాన్‌పై ఆంక్షల అస్త్రాలను ప్రయోగిస్తోంది. సెప్టెంబర్ 23 నుంచి ప్రపంచవ్యాప్తంగా ఇరాన్‌కు చెందిన అన్ని విమానయాన సంస్థల సర్వీసులను నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. ఒకవేళ ఇరాన్ విమానయాన సంస్థలకు సేవలు అందించడం కొనసాగిస్తే, విదేశీ కంపెనీలపై ద్వితీయ (సెకండరీ) ఆంక్షలు విధిస్తామని హెచ్చరించింది. అమెరికా– ఇరాన్ యుద్ధం ప్రారంభమై ఏడు నెలలు పూర్తవుతున్న తరుణంలో ఓ ఇంటర్వ్యూలో అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఈ ప్రకటన చేశారు.

**ఇరాక్, జార్జియా, తుర్కియే ఆంక్షలు**

అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ప్రకటన తర్వాత ఇరాక్, జార్జియా, తుర్కియే వంటి దేశాలు తమ దగ్గర ఇరాన్ విమానయాన సంస్థల కార్యకలాపాలను నిషేధిస్తున్నట్లు తెలిపాయి. తమ దేశంలో ఇరాన్ విమానయాన సంస్థల సర్వీసులను నిలిపివేస్తామని ఇరాక్ ప్రకటించింది. తమ భూభాగంలోకి రాకుండా ఇరాన్ విమానాలను నిషేధిస్తామని జార్జియా పేర్కొంది. తుర్కియే ప్రభుత్వ అభ్యర్థన మేరకు తమ సేవలను నిలిపివేసినట్లు ఇరాన్ విమానయాన సంస్థ మహాన్ తెలిపింది.




**ఇరాన్‌పై యూఎస్ ఆంక్షల పరంపర**

కాగా, ఇరాన్ ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి ఆ దేశంలోని ఇంధన, నౌకా రవాణా, సాంకేతిక, బంగారం, డిజిటల్ ఆస్తులు వంటి రంగాలను సైతం లక్ష్యం చేసుకోవడానికి అమెరికా సిద్ధమవుతోంది. (మిగతా 2లో)

# అక్టోబర్ 16న రాజ్యసభ ఎన్నికలు



**⏭ మూడు రాష్ట్రాల్లో 12 స్థానాలకు పోలింగ్**

**⏭ సెప్టెంబర్ 29న నోటిఫికేషన్-**

**టీ మీడియా,సెప్టెంబర్ 22, ఢిల్లీ బ్యూరో :** ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, బంగాల్ రాష్ట్రాల్లో మొత్తం 12 రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 16న ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఉత్తర్?ప్రదేశ్‌లో 10 రాజ్యసభ స్థానాలు, ఉత్తరాఖండ్‌లో ఒకటి, బంగాల్‌లో ఒక స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. అక్టోబర్ 16న పోలింగ్‌తో పాటు ఓట్ల లెక్కింపు కూడా చేపట్టనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

**సెప్టెంబర్ 29న నోటిఫికేషన్**

ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ సెప్టెంబర్ 29న విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు అక్టోబర్ 6 వరకు గడువు ఉంటుంది. అనంతరం ఎన్నికల ప్రక్రియ కొనసాగి అక్టోబర్ 16న పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు ఓట్ల లెక్కింపు కూడా జరుగుతుంది. ఉత్తరప్రదేశ్‌లో ప్రస్తుత రాజ్యసభ సభ్యుల పదవీకాలం నవంబర్ 25తో ముగియనుంది. దీంతో ఆ రాష్ట్రంలోని 10 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలు వచ్చే ఏడాది జరగనున్న ఉత్తర్?ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరుగుతుండటంతో రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**యూపీలో పదవీ విరమణ చేస్తున్న సభ్యులు**

ఉత్తర్?ప్రదేశ్ నుంచి పదవీకాలం ముగుస్తున్న రాజ్యసభ సభ్యుల్లో బీజేపీకి చెందిన అరుణ్ సింగ్, గీతా శాక్య, నీరజ్ శేఖర్, బ్రిజ్‌లాల్, బి.ఎల్. వర్మ, సీమా ద్వివేది, హర్దీప్ సింగ్ పూరీ ఉన్నారు. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన రామ్ గోపాల్ యాదవ్, బీఎస్పీకి చెందిన రామ్‌జీ గౌతమ్ కూడా పదవీకాలం ముగించుకోనున్నారు. ఇదే సమయంలో ఉత్తర్?ప్రదేశ్‌కు చెందిన మాజీ ఉప ముఖ్యమంత్రి దినేశ్ శర్మ రాజీనామాతో ఒక రాజ్యసభ స్థానం సెప్టెంబర్ 11 నుంచి ఖాళీగా ఉంది. అండమాన్ అండ్ నికోబార్ దీవుల లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమితులైన తర్వాత దినేశ్ శర్మ రాజీనామా చేశారు.

**బీజేపీకి 8 స్థానాలు దక్కే అవకాశం**

ప్రస్తుత ఉత్తర్?ప్రదేశ్ అసెంబ్లీ బలాబలాలను పరిశీలిస్తే, బీజేపీ (మిగతా 2లో)

## సంస్కృతికి ప్రతీకలుగా కొత్త విమానాశ్రయాలు





**⏭|సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు**

**టీ మీడియా ,సెప్టెంబర్ 22,హైదరాబాద్:** ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీలోని తెలంగాణ భవన్ నిర్మాణాల్లో తెలంగాణ సంస్కృతి, చరిత్ర, శిల్పకళ ప్రతిబింబించేలా డిజైన్లు రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయం, పిల్లలమర్రి వంటి చారిత్రక కట్టడాల శిల్ప, వాస్తు కళను పరిశీలించి, వాటి స్ఫూర్తితో నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. వరంగల్ విమానాశ్రయం డిజైన్ కాకతీయ చరిత్ర, సంస్కృతిని ప్రతిబింబించేలా ఉండాలన్న అభిప్రాయాన్ని సీఎం గతంలోనూ వ్యక్తం చేశారు. ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీలోని తెలంగాణ భవన్ నిర్మాణాలపై సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా (మిగతా 3లో)

# రిమ్స్‌లో ఏసీ పేలి మంటలు

**⏭|ఊపరాడక ముగ్గురు చిన్నారులు మృతి**

**టీ మీడియా ,సెప్టెంబర్ 22,ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో పిల్లలవార్డులోని నియోనాటల్ స్పెషల్ కేర్ యూనిట్–లో ప్రమాద తీవ్ర విషాదాన్ని నింపింది. సోమవారం అర్ధరాత్రి ూజపేలి దట్టంగా పొగ అలముకుంది. ఆ సమయంలో ఇంక్యూబెటర్లలో 27 మంది పసికందులకు చికిత్స పొందుతుండగా పొగ కారణంగా వారికి ఊపిరి ఆడని పరిస్థితి ఏర్పడింది. సిబ్బంది, వైద్యాధికారులు.. వెంటనే అద్దాలను పగలగొట్టి పసికందులను బయటకు తీసుకొచ్చారు. అప్పటికే ఇచ్చోడకు చెందిన సలీం కూతురు ఐదురోజుల చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. అనంతరం మరో చిన్నారి కూడా ప్రాణాలు విడిచింది. పరిస్థితి విషమంగా ఉన్న 20 రోజుల చిన్నారిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. చిన్నారి మృతి చెందింది. మిగిలిన



24మంది పిల్లల్ని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా... వారి పరిస్థితి బాగానే ఉన్నట్లు అధికారులు, వైద్యులు తెలిపారుఅర్ధరాత్రి దాటిన తర్వాత ఒక్కసారిగా ఏసీ పేలిపోవటం కలకలం సృష్టించింది. ఈ ఘటనతో ఉలిక్కిపడిన సిబ్బంది హాహాకారాలతో భయానక వాతావరణం నెలకొంది. ఏం జరుగుతుంతో తెలియని గందరగోళానికి దారి తీసింది. ఆ సమయంలో రౌండ్స్‌కు వచ్చిన డైరెక్టర్ జైసింగ్ విషయం తెలుసుకొని సిబ్బంది సహా అంబులెన్స్ డ్రైవర్లతో కలిసి ఎన్ఎన్‌సీయూ వెళ్లగా ఊపిరి ఆడనీయకుండా (మిగతా 2లో)

# తీవ్ర వాయుగుండంగా అల్పపీడనం

**⏭|ఒడిశా, బెంగాల్‌లో భారీ వర్షాలు..**

**టీ మీడియా,సెప్టెంబర్ 22, ఢిల్లీ బ్యూరో:** బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడన ద్రోణి మరింత తీవ్రరూపం దాల్చుతోంది. ఇది రాత్రికి తీవ్ర వాయుగుండంగా మారనుందని వాతావరణ విభాగం వెల్లడించింది. అయితే తక్షణమే తుపానుగా మారే ముప్పు ప్రస్తుతానికి లేదని స్పష్టం చేసినప్పటికీ, తీవ్ర వాయుగుండంగా బలపడి తీరం వైపు పయనించే క్రమంలో బలమైన గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని



హెచ్చరించింది. ఒకవేళ మరింత శక్తిని పుంజుకుని తుపానుగా రూపాంతరం చెందితే.. దానికి అర్నాబ్ అని నామకరణం చేయనున్నారు. బంగ్లాదేశ్ సూచించిన ఈ పేరుకు సముద్రం అనే అర్థం.

**తీరం వైపు నత్తనడకన ప్రయాణం**

వాయుగుండం ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు నైరుతి దిశలో దాదాపు 200 కిలోమీటర్ల దూరంలో, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నానికి తూర్పుగా 290 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. విశాఖపట్నం -- గోపాల్‌పూర్ రేవుల మధ్య బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇది తీరాన్ని తాకే అవకాశాలున్నట్లు వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ఈ ప్రభావంతో గంటకు 70 కిలోమీటర్ల పెనుగాలులతో పాటు కోస్తా తీరం వెంబడి భారీ నుంచి అతిభారీ (మిగతా 2లో)

## కొత్త పింఛన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు

**టీ మీడియా ,సెప్టెంబర్ 22,హైదరాబాద్:** రాష్ట్రంలో కొత్తగా జారీ చేయనున్న పింఛన్లపై స్త్రీ, శిశు సంక్షేమం శాఖ మంత్రి సీతక్క దృష్టి సారించారు. అక్టోబర్‌లో కొత్త పెన్షన్ల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. దసరా పండుగకు ముందే కొత్త పెన్షన్లు అందేలా చూడాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అందుకని పింఛన్లకు దరఖాస్తు చేసుకున్న వారి గురించి క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు సీతక్క.కొత్త పింఛన్ లబ్ధిదారులకు అక్టోబర్‌లో తీపి కబురు చెప్పాలని స్త్రీ, శిశు సంక్షేమం శాఖ మంత్రి సీతక్క



అధికారులకు తెలిపారు. దసరా ముందే వారికి పింఛన్లు అందాలని, అందుకు త్వరితగతిన క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ప్రక్రియను (మిగతా 2లో)

# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**● మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**టి మీడియా, సెప్టెంబర్ 22,ఖమ్మం:**

ఖమ్మం నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత–జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్‌లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ఖమ్మం నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మంచుకొండ ఎత్తిపోతల పథకం పరిధిలోని అన్ని చెరువులను నింపేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బుగ్గవాగు ఎత్తిపోతల పథకం పనులు చాలా కాలంగా ఆలస్యమవుతున్నాయని, పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. బుగ్గవాగు నీటిని గ్రావిటీ ద్వారా ఏఏ కాలువలకు అందించవచ్చో పరిశీలించి, అవసరమైన అంచనాలను సవరించి సమర్పించాలని ఆదేశించారు. పనుల పురోగతికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్‌కు అందజేయాలని తెలిపారు.

మున్నేరు రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి భూసేకరణకు అవసరమైన 10–ఏ మినహాయింపు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పనుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించే ధోరణిని మార్చుకోవాలని, నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా బాధ్యతతో పనిచేయాలని అన్నారు. డ్రైనేజీ డిజైన్లు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ లేఅవుట్‌ను త్వరగా తుది రూపంలో సిద్ధం చేయాలని, వచ్చే వర్షాకాలం లోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సాగునీరు, త్రాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి అన్నారు. గోదావరి జలాలను సక్రమంగా ప్రణాళిక చేసుకుని వినియోగించాలని, ఒక్క ఎకరం పంట కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్టోబర్ 15 వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాలువలు, షట్టర్లు, నీటి మట్టాల నిర్వహణపై




ప్రత్యేక దృష్టి పెట్టాలని, వచ్చే సీజన్ నుంచి అన్ని నిర్వహణ పనులను వేసవిలోనే పూర్తి చేయాలని ఆదేశించారు. త్రాగునీటినీ జాగ్రత్తగా వినియోగించాలని, నీటి విడుదల సమయాలను ప్రజలకు ముందుగానే తెలియజేయాలని మంత్రి సూచించారు. ఎక్కడా నీటి లీకేజీలు లేకుండా చర్యలు చేపట్టాలని, అవసరమైతే నాగార్జునసాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి కూడా నీటిని ఎత్తిపోసుకునే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు.

రోడ్లపై ఎలాంటి ఆక్రమణలు ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు. కేబుల్ బ్రిడ్జి పనులకు మరో నెల రోజుల సమయం మాత్రమే ఉన్నందున పనులను త్వరగా పూర్తి చేయాలని, నవంబర్‌లో హ్యాండోవర్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

హ్యామ్ రోడ్లలో ప్రస్తుతం మంజూరైన బలోపేత పనులు అవసరం లేదని, నాలుగు లేన్ల రహదారి విస్తరణను ఇల్లందు వరకు చేపట్టేలా అవసరమైన అంచనాలను సవరించాలని సూచించారు. మెడికల్ కళాశాల హాస్టల్, అడ్మినిస్ట్రేటివ్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి కేబుల్ బ్రిడ్జితో పాటు ప్రారంభించేలా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

మంజూరైన అన్ని పనులను అక్టోబర్ నుంచి ప్రారంభించేలా సెప్టెంబర్ నెలాఖరులోగా టెండర్లు, ఇతర పత్రాల ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. అక్టోబర్ నుంచి జూన్ వరకు అనుకూలమైన పనుల సీజన్‌ను పూర్తిస్థాయిలో వినియోగించు కోవాలని తెలిపారు.

వచ్చే రబీ సీజన్‌కు వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటి నుంచే పంటల ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. నాగార్జునసాగర్‌లో నీటి లభ్యత లేకపోవడం, కాలువల ద్వారా సాగునీటి పరిస్థితి, భూగర్భ జలాల లభ్యత, విద్యుత్ సరఫరా వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని తెలిపారు. సెప్టెంబర్ నెలాఖరులోగా ప్రత్యామ్నాయ రబీ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, అవసరమైన విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

ఎల్‌నినో పరిస్థితులను అనుకూలంగా వినియోగించుకుని ఆయిల్‌పామ్ సాగును విస్తృతంగా పెంచాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులను వెంటనే ఎంపిక చేసి ఇళ్లను మంజూరు చేయాలని మంత్రి ఆదేశించారు. గుడిసెల్లో నివసిస్తున్న వారికి మొదటి ప్రాధాన్యత, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివసిస్తున్న వారికి తదుపరి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అర్హులైన వారికే ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

వెలుగుమట్ల కాలనీలోని అన్ని ఇళ్లను నవంబర్ 21లోగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రం, విద్యుత్ లైన్లు, డ్రైనేజీ తదితర అన్ని మౌళిక వసతుల పనులను పూర్తి చేసి కాలనీని ఆదర్శ కాలనీగా అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసేలా ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనను అనుసంధానం చేయాలని, మున్సిపల్ శాఖతో సమన్వయం చేసుకుని చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఖమ్మం నగరానికి వచ్చే పదేళ్లలో అవసరమయ్యే విద్యుత్‌ను అంచనా వేసి సబ్‌స్టేషన్లను ప్రణాళిక చేయాలని మంత్రి సూచించారు. ముఖ్యమైన ప్రాంతాల్లో విద్యుత్ కేబుళ్లతో పాటు అవసరమైన ఇతర కేబుళ్లను భూగర్భంలో ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారి విస్తరణ, భూగర్భ కేబుళ్లు, తదితర పనులను అన్ని శాఖల సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు.

గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు దశల వారీగా సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి అన్నారు. అన్ని పాఠశాలలు, హాస్టళ్లను తనిఖీ చేసి అవసరమైన పనులను చేపట్టాలని, అన్ని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో కనీస మౌళిక వసతులు ఉండేలా చూడాలని ఆదేశించారు. ఖమ్మంలోని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను వచ్చే జూన్ లోగా పూర్తి చేయాలని, రాష్ట్రంలో తొలి యంగ్ ఇండియా స్కూల్‌గా ఖమ్మం పాఠశాలను ప్రారంభించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

ఖమ్మంలో షాదీఖానా నిర్మాణానికి అనువైన స్థలాన్ని, హరిత భవన్‌కు అవసరమైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు పంపాలని రెవెన్యూ అధికారులను మంత్రి ఆదేశించారు. కమ్యూనిటీ అసోసియేషన్లకు భూమి కేటాయింపులను ఒకే ప్రాంతంలో చేపట్టేలా స్థలాన్ని గుర్తించి అవసరమైన కేటాయింపులు చేయాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మంచుకొండ ఎత్తిపోతల పథకం పరిధిలోని చెరువులను నింపుతున్నట్లు తెలిపారు. మున్నేరు రక్షణ గోడ మిగిలిన పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.

పంచాయతీరాజ్ శాఖ పరిధిలో హ్యామ్ రోడ్లకు సంబంధించి 10 పనులకు రూ.36.60 కోట్ల మంజూరు లభించిందని, టెండర్ ప్రక్రియ పూర్తయిందని, నెల రోజుల్లో పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు.

ఖమ్మం నియోజకవర్గంలో ఏడు కొత్త సబ్‌స్టేషన్లు ప్రతిపాదించామని, వాటికి అవసరమైన భూములు కేటాయించామని కలెక్టర్ తెలిపారు. భూగర్భ విద్యుత్ కేబుళ్ల ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించినట్లు వెల్లడించారు.

ఈ సీజన్‌లో జిల్లాలోని 20 మండలాల్లో వర్షపాతం లోటు ఉన్నప్పటికీ గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం కేవలం 7 వేల ఎకరాలు మాత్రమే తగ్గిందని తెలిపారు. పెసర సాగు విస్తీర్ణం పెరిగిందని, ఈ ఏడాది అదనంగా 5 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టినట్లు వివరించారు.

ఖమ్మం ఖిల్లా రోప్‌వే దిగువ స్టేషన్ పనులు కొనసాగుతున్నాయని, 2027 మార్చి నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో మంజూరైన 137 పనుల్లో 54 పనులు పూర్తయ్యాయని, మరో 54 పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు తెలిపారు. నీటి నిల్వ సమస్యలను పరిష్కరించామని, ప్రధాన రహదారులపై యంత్రాలతో స్వీపింగ్ నిర్వహించడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తున్నాయని వివరించారు.

ఈ సమీక్షలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓయో హోటల్‌లో యువతి అనుమానాస్పద మృతి






**టీ మీడియా ,సెప్టెంబర్ 22, హైదరాబాద్**

నగరంలో ఓయో హోటల్‌లో యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిద్ధిఖీ నగర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. విశాఖపట్నానికి చెందిన షారోన్ నిఖితా టోప్నో తన ప్రియుడు శ్రీనివాస రవి తేజతో కలిసి ఓయో యాప్ ద్వారా హోటల్‌లోని 303వ గదిని బుక్ చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రోడ్ నంబర్–5లోని హోటల్‌లో ఇద్దరూ చెక్‌ఇన్ చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు.అర్ధరాత్రి సమయంలో యువతి అపస్మారకస్థితిలో పడి ఉండటంతో శ్రీనివాస రవి తేజ, హోటల్ సిబ్బంది కలిసి కొండాపూర్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న మాదాపూర్ పోలీసులు హోటల్‌కు చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.యువతి ముఖం, తలపై గాయాలు, వాపులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు యువతి మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే ఆమెతో హోటల్‌కు వచ్చిన ప్రియుడు ఆసుపత్రి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. దీంతో అతడి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.హోటల్‌లోని 303వ గదిని పరిశీలించిన పోలీసులకు గోడలు, బెడ్‌షీట్‌పై రక్తపు మరకలు కనిపించినట్లు సమాచారం. గదిలో ఖాళీ బీర్, విస్కీ బాటిళ్లు కూడా గుర్తించారు. క్లూస్ టీమ్‌ను రంగంలోకి దించిన పోలీసులు ఫోరెన్సిక్ ఆధారాలను సేకరిస్తున్నారు. హోటల్‌లోని సీసీటీవీ ఫుటేజీతో పాటు ఇతర ఆధారాలను పరిశీలిస్తున్నారు.పరారీలో ఉన్న శ్రీనివాస రవి తేజ ఫోన్ చివరి లొకేషన్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఆ తర్వాత అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ అయినట్లు సమాచారం. దీంతో అతడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు కొనసాగిస్తున్నాయి.యువతికి గాయాలు ఎలా అయ్యాయి? హోటల్ గదిలో అసలు ఏం జరిగింది? ఆమె మృతికి కారణం ఏమిటన్న అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం యువతి మృతిని పోలీసులు అనుమానాస్పదంగా పరిగణిస్తూ అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నారు. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికలు వచ్చిన తర్వాతే మరణానికి అసలు కారణంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# వీసా ఫ్రీ ట్రావెల్‌ను దుర్వినియోగం చేయొద్దు..

**● భారత హై కమిషన్ అడ్వయిజరీ..!**

**టీ మీడియా,సెప్టెంబర్ 22, ఢిల్లీ బ్యూరో :**

మలేసియా వచ్చే భారత ప్రయాణికులకు కౌలాలంపూర్ లోని భారత హైకమిషన్ కీలక సూచన చేసింది. మలేసియా అందిస్తున్న 30 రోజుల వీసా ఫ్రీ ట్రావెల్‌ను దుర్వినియోగం చేయొద్దని సూచించింది. దాన్ని ఉపాధి అవకాశాల కోసం వినియోగించొద్దని పేర్కొన్నది. నకిలీ జాబ్ ఆఫర్లతో మలేసియాకు వస్తున్న భారతీయుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ మేరకు అడ్వైజరీ జారీచేసింది.ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు ఏజెంట్లు నిరుద్యోగులకు వల వేస్తున్నారని, వారి చేతిలో



చాలామంది మోసపోతున్నారని హైకమిషన్ తన అడ్వైజరీలో పేర్కొన్నది. పర్యాటక లేదా వీసా ఫ్రీ ట్రావెల్‌పై వచ్చి ఇక్కడ గడువుకు మించి ఉండిపోతున్నారని, దాంతో చట్టపరంగా చర్యలు ఎదుర్కొంటున్నారని తెలిపింది. భారత పాస్‌పోర్ట్ కలిగిన వారికి ఇస్తున్న 30 రోజుల వీసా రహిత ప్రవేశం కేవలం పర్యాటకం, సామాజిక సందర్శన కోసం ఉద్దేశించినది మాత్రమేనని భారత హైకమిషన్ తెలిపింది.దీన్ని ఉపాధి అవసరాల కోసం వినియోగించడం మలేసియా వలస నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నది. కాబట్టి వర్క్ పర్మిట్ లేకుండా మలేసియాకు రావొద్దని సూచించింది. అలాగే మలేసియా వచ్చే సాధారణ ప్రయాణికులు సైతం రిటర్న్ టికెట్, హోటల్ బుకింగ్ వంటి ట్రావెల్ ప్రణాళికతో రావడంవల్ల ఇమిగ్రేషన్ ఇబ్బందులు తలెత్తవని పేర్కొన్నది. పాస్‌పోర్టు వ్యాలిడిటీ కూడా కనీసం 6 నెలలు చెల్లుబాటులో ఉండేవిధంగా ఉండాలని సూచించింది. మలేసియా ఈ ఏడాది చివరివరకు భారత పౌరులకు వీసా ఫ్రీ ట్రావెల్ సదుపాయాన్ని అందిస్తోంది.

# కొత్త పింఛన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

వేగవంతం చేయాలని ఆమె ఆదేశించారు.వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయడానికి అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించాలని ఆదేశించిన సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్‌కు సీతక్క స్పష్టం చేశారు. పూర్తి స్థాయిలో ఒంటరి మహిళలు, వితంతువులకు పెన్షన్లు ఇవ్వాలని ఆమె సూచించారు. కాబట్టి దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పెన్షన్లు అందేలా చర్యలు తీసుకోవాలని సీతక్క ఆదేశించారు. దసరా నాటికి కొత్త పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని అధికారులతో మంత్రి పేర్కొన్నారు.

# ఇరాన్‌పై అమెరికా కొత్త అస్త్రం

(మొదటి పేజీ తరువాయి)

ఈ క్రమంలో తాజాగా ఇరాన్ విమానయానంపై ఆంక్షలకు దిగింది. గురువారం (సెప్టెంబరు 24న) చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జరపనున్న శిఖరాగ్ర సమావేశానికి పునాది వేసేందుకు చైనా ఉప ప్రధాని హే లిఫెంగ్‌తో స్కాట్ బెసెంట్ ఆర్థిక చర్చలు జరిపారు. అనంతరం ఇరాన్‌పై ఆంక్షల పర్వం కొనసాగించారు. ఇప్పటికే ఇరాన్‌పై బెసెంట్ 'ఎకనామిక్ డి–డే' ఆంక్షలను విధించారు. తమతో యుద్ధం చేస్తున్న ఇరాన్‌ను ఆర్థికంగా ఏకాకిని చేసేందుకు అమెరికా చర్యలు తీసుకుంటోంది.

# అక్టోబర్ 16న రాజ్యసభ ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

నేతృత్వంలోని కూటమికి 10 ఖాళీ స్థానాల్లో ఎనిమిది దక్కే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. సమాజ్‌వాదీ పార్టీ రెండు స్థానాలను గెలుచుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఖాళీ అవుతున్న 10 స్థానాల్లో ఎనిమిదింటిని బీజేపీ, ఒకదాన్ని సమాజ్‌వాదీ పార్టీ, మరో స్థానాన్ని బీఎస్పీ కలిగి ఉన్నాయి. ఈ ఎన్నికల ఫలితాల తర్వాత రాజ్యసభలో బీఎస్పీకి ప్రాతినిధ్యం లేకుండా పోయే అవకాశం ఉంది. ప్రస్తుత బలాబలాల ప్రకారం రామ్‌జీ గౌతమ్ స్థానాన్ని తిరిగి గెలుచుకునేందుకు అవసరమైన సంఖ్యాబలం బీఎస్పీకి లేదు.

# రిమ్స్‌లో ఏసీ పేలి మంటలు

(మొదటి పేజీ తరువాయి)

దట్టమైన పొగ అలుముకుంది. ఈ ఘటన గురించి తెలుసుకున్న కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ హుటాహుటిన రిమ్స్ ఆసుపత్రికి చేరుకున్నారు. దగ్గరుండి సహాయక చర్యలు చేపట్టారు. బాధితులను ఓదార్చే ప్రయత్నం చేశారు.

**ఘటనపై విచారణకు సీఎం ఆదేశం**

ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్నారులు మృతి చెందడం.. అత్యంత బాధాకరమన్నారమన్న ఆయన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చికిత్స పొందుతున్న మిగిలిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు దారితీసిన కారణాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని ఆదేశించారు. మంత్రులు సైతం రిమ్స్ ఘటనపై విచారం వ్యక్తంచేశారు.

**ఆసుపత్రికి వచ్చిన మంత్రి దామోదర**

రిమ్స్ ఆసుపత్రిలో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పర్యటించారు. రిమ్స్ ఆస్పత్రిలో ఇద్దరు చిన్నారులు మృతి చెందడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి ప్రకటించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. ప్రమాదంపై కమిటీ వేశామన్న మంత్రి కమిటీ నివేదిక వచ్చిన తదుపరి కార్యాచరణ చేపడతామన్నారు. రిమ్స్ లో ఎమర్జెన్సీ, హెమటాలజీ, తల్లి, పిల్లల వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే రిమ్స్ లో 100 పడకలతో వీజు భవనం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

# తీవ్ర వాయుగుండంగా అల్పపీడనం

(మొదటి పేజీ తరువాయి)

వర్షాలు కురుస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఈ తీవ్ర అల్పపీడన ప్రభావంతో దక్షిణ బెంగాల్‌లోని ఆరు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా ఉత్తర 24 పరగణాలు, దక్షిణ 24 పరగణాలు, తూర్పు మేదినీపూర్, పశ్చిమ మేదినీపూర్, బీర్‌భూమ్ జిల్లాలకు వర్ష హెచ్చరికలు జారీ అయ్యాయి. కోల్‌కతా సహా పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడనున్నాయి. దక్షిణ బెంగాల్ జిల్లాలతో పాటు జార్గ్రామ్, పురూలియా జిల్లాల్లో బుధ, గురువారాల్లో వర్ష తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో పిడుగుపాటు ప్రమాదాల బారిన పడకుండా ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో తిరగొద్దని విపత్తు నిర్వహణ విభాగం సూచించింది.

# ఏఎస్ఐగా హరికి పదోన్నతి



**⏭ స్వీట్ తినిపించిన సీఐ నూనావత్ సాగర్**

**టీ మీడియా,సెప్టెంబర్22,సింగరేణి(కారేపల్లి):**
కామేపల్లి పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జి.హరి ఏఎస్ఐగా పదోన్నతి పొందారు.పదోన్నతి పొందిన హరిని సింగరేణి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నూనావత్ సాగర్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.మంగళవారం కారేపల్లిలోని సర్కిల్ కార్యాలయంలో కామేపల్లి ఎస్ఐ పి.శ్రీకాంత్‌తో కలిసి హరి సీఐ సాగర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా హరికి సీఐ స్వీట్ తినిపించి పదోన్నతిపై అభినందనలు తెలిపారు.సీఐ సాగర్ మాట్లాడుతూ పదోన్నతితో బాధ్యత మరింత పెరుగుతుందని,విధి నిర్వహణలో నిబద్ధత,సమర్థతతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని సూచించారు.పోలీసు శాఖలో క్రమశిక్షణ,అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.హరి ఏఎస్ఐగా పదోన్నతి పొందడం పట్ల కారేపల్లి ఎస్ఐ బైరు గోపి,సర్కిల్ కార్యాలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# ఇసుక అక్రమ రవాణాపై రైతుల ఆందోళన

**⏭ విచారణకు బీఆర్ఎస్ డిమాండ్**

**టీ మీడియా, సెప్టెంబర్ 22, దేవరకద్ర:**
చిన్నచింతకుంట మండలం బండ్రవల్లి గ్రామంలో అర్ధరాత్రి సమయంలో ఇసుక తరలిస్తున్న 7 టిప్పర్లను రైతులు అడ్డుకున్నారు. రాత్రి 2 గంటల సమయంలో భారీ వాహనాల్లో ఇసుక తరలిస్తుండటంపై అనుమానాలు వ్యక్తం చేసిన రైతులు టిప్పర్లను నిలిపివేశారు. విషయం తెలుసుకున్న చిన్నచింతకుంట మండల బీఆర్ఎస్ నాయకులు అక్కడికి చేరుకుని రైతులకు మద్దతుగా నిలిచారు.గత మూడు నెలలుగా మండలంలో ఇసుక రవాణాపై అనుమానాలు, ఫిర్యాదులు వస్తున్నప్పటికీ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. అర్ధరాత్రి వేళల్లో భారీ టిప్పర్లు గ్రామీణ రహదారులపై తిరుగుతున్నా అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పర్మిట్లు ఉన్నాయా?**
అడ్డుకున్న 7 టిప్పర్లకు చెల్లుబాటు అయ్యే అనుమతులు, ట్రాన్సిట్ పాస్‌లు ఉన్నాయా? అనుమతించిన పరిమితికి మించి ఇసుక తరలించారా? రవాణా సమయం, ఇసుక పరిమాణం, గమ్యస్థానం వంటి వివరాలను అధికారులు పరిశీలించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.ఇసుక అక్రమ రవాణా వెనుక రాజకీయ జోక్యం ఉందా? ఎవరి అండతో ఈ వ్యవహారం జరుగుతోంది? అనే అనుమానాలను కూడా వారు వ్యక్తం చేశారు. దేవరకద్ర నియోజకవర్గంలో ఎమ్మెల్యే అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇసుక వ్యాపారాన్ని



ప్రోత్సహిస్తున్నారంటూ వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని, ఈ వ్యవహారంలో కీలక పాత్ర ఉందని తాము ఆరోపిస్తున్న 'షాడో ఎమ్మెల్యే' అంశాన్ని కూడా అధికారులు పరిశీలించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు.

**అక్రమమైతే కఠిన చర్యలు తీసుకోవాలి**
అక్రమ ఇసుక తవ్వకాలు, అధిక రవాణా వల్ల భూగర్భ జలాలు, వ్యవసాయం, గ్రామీణ రహదారులపై ప్రభావం పడే అవకాశం ఉందని నాయకులు పేర్కొన్నారు. బండ్రవల్లి ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.
గత మూడు నెలల్లో జరిగిన ఇసుక రవాణాపై కూడా తనిఖీలు నిర్వహించి, అక్రమ రవాణా జరిగినట్లు తేలితే వాహనాలను సీజ్ చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా అధికారులు చట్టప్రకారం వ్యవహరించాలని అన్నారు.

**ఎమ్మెల్యే స్పందన**
ఈ వ్యవహారంపై దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి స్పందించారు. ఇసుక వ్యవహారంలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినట్లయితే వారిని వదిలిపెట్టేది లేదని తెలిపారు. సంబంధిత వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. ఘటనపై లోతుగా విచారణ జరిపి, తప్పు చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

# 24 గంటల పాటు మద్యం విక్రయాలపై నిషేధం



**⏭ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు**

**టీ మీడియా,సెప్టెంబర్22,ఖమ్మం:**
వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా శాంతిభద్రతలను కాపాడేందుకు ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 24 గంటల పాటు మద్యం విక్రయాలు, సరఫరాపై నిషేధం విధించారు.పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు 23-09-2026 ఉదయం 6 గంటల నుంచి 24-09-2026 ఉదయం 6 గంటల వరకు ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని మద్యం దుకాణాలు, బార్లు & రెస్టారెంట్లు, క్లబ్బులు, ఇతర మద్యం విక్రయించే లేదా సర్వ్ చేసే సంస్థలను పూర్తిగా మూసివేయాలి.ఈ సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం విక్రయించడం, సరఫరా చేయడం లేదా సర్వ్ చేయడం చేయరాదని అధికారులు స్పష్టం చేశారు.వినాయక నిమజ్జనం సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు తెలంగాణ ఎక్సైజ్ చట్టం--1968లోని సెక్షన్ 20 కింద ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు.

# ఆదాయానికి మించి ఆస్తుల కేసు

**⏭ లక్ష్మీభాస్కర్ అరెస్టు**

**టీ మీడియా ,సెప్టెంబర్ 22,హైదరాబాద్ బ్యూరో :**
నిమ్స్ అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీభాస్కర్ నివాసం, కార్యాలయాలపై ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంలో ఈ తనిఖీలు చేపట్టారు. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో లక్ష్మీభాస్కర్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఏసీబీ న్యాయమూర్తి ఎదుట లక్ష్మీభాస్కర్‌ను హాజరుపరిచారు. ఎర్రగడ్డలో లక్ష్మీభాస్కర్‌కు చెందిన కల్పతరువు అపార్ట్‌మెంట్స్ సహా ఆయన కుటుంబసభ్యులు, సన్నిహితులు, బంధువుల నివాసాల్లోనూ సోదాలు జరిగాయి. మొత్తం 13 ప్రాంతాల్లో ఏకకాలంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు. ఏసీబీ అధికారులు బృందాలుగా ఏర్పడి ఈ రైడ్? చేశారు.

లక్ష్మీ భాస్కర్?ను అరెస్టు చేస్తాం
హైదరాబాద్?లోని లక్ష్మీ భాస్కర్ నివాసంతో పాటు అతని బంధువులు స్నేహితుల ఇళ్లల్లో మొత్తం ఏడు చోట్ల సోదాలు కొనసాగుతున్నాయని ఏసీబీ డీఎస్పీ లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. అన్నిచోట్ల తనిఖీలు పూర్తయిన తర్వాత మొత్తం వివరాలు సేకరించి ఒక అంచనాకు వస్తామని వెల్లడించారు. ఈ ప్రక్రియ



అనంతరం లక్ష్మీ భాస్కర్?ను అరెస్టు చేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఎంత నగదు లభించిందనే వివరాలు తెలియాల్సి ఉంది.

అనేక అవినీతి ఆరోపణలు
లక్ష్మీభాస్కర్ నిమ్స్ ఆసుపత్రిలో దాదాపు 20 ఏళు ్లగా పని చేస్తున్నారు. 5 ఏళ్లుగా అదనపు సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే గతంలోనూ ఆయనపై పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. కొవిడ్ సమయంలో వెంటిలేటర్ బెడ్స్ అమ్ముకున్నారని, నిమ్స్‌లో టపాసులు దాచిన ఘటనలోనూ ప్రధానంగా ఆయన పేరే వినిపించినట్లు తెలుస్తోంది. లక్ష్మీభాస్కర్ సీఎంఆర్ఎఫ్ డబ్బులు ఇప్పించేందుకు మధ్యవర్తుల ద్వారా రోగుల నుంచి వాటా తీసుకునే వారని ఆరోపణలు కూడా ఉన్నాయి.

# లారీ ఢీకొని వ్యక్తి మృతి



**టీ మీడియా ,సెప్టెంబర్ 22, బూర్గంపహాడ్ :**
రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం బూర్గంపహాడ్ మండల పరిధిలోని లక్ష్మీపురంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ మేడా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామానికి చెందిన గడ్డం సత్యం (55) ద్విచక్రవాహనంపై వెనుక పవన్‌కుమార్‌తో కలిసి లక్ష్మీపురం వైపు వెళ్తుండగా మధ్యాహ్నం 2 గంటల సమయంలో నయారా పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనం నడుపుతున్న గడ్డం సత్యం లారీ వెనుక టైరు కింద పడడంతో అక్కడికక్కడే మృతిచెందగా వెనుక కూర్చున్న పవన్‌కుమార్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స కోసం స్థానికులు ఆస్పత్రికి తరలించారు. సత్యం కుమారుడు గడ్డం ఆనంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలి

**⏭ మంత్రిపొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**టీ మీడియా ,సెప్టెంబర్ 22, ఖమ్మం రూరల్:**
ప్రజలకు ఒకే చోట ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేసి సుపరిపాలన అందించాలనే ఉద్దేశ్యంతో చేపట్టిన ఖమ్మం రూరల్ మండల సమీకృత కార్యాలయాల భవన నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు.ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంతంలో నిర్మిస్తున్న ఖమ్మం రూరల్ మండల సమీకృత కార్యాలయాల భవన సముదాయ నిర్మాణ పనుల పురోగతిని మంత్రి మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూలి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎక్కడా తగ్గకుండా చేపడుతున్నదని, ఖమ్మం రూరల్ మండలంలో కార్యాలయ సముదాయ నిర్మాణ పనులను సుమారు 45 కోట్ల రూపాయలతో చేపట్టామని, పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదని, పనుల్లో వేగం పెంచి నాణ్యతతో పూర్తి చేయాలని అన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ లేదని, పనులు క్వాలిటీగా ఉంటేనే బిల్లులు మంజూరు చేస్తామని తెలిపారు. ఖమ్మం రూరల్ మండలానికి సంబంధించి కార్యాలయాలు ఒకే చోట ఉండేలా నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ఇక్కడ భవన నిర్మాణ నాణ్యతలో మంచి ప్రమాణాలు పాటించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను, ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. వివిధ సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల కోసం అన్ని సదుపాయా లతో, సౌకర్యవంతంగా ఉండే విధంగా భవన సముదాయాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఏసీబీకి పట్టుబడ్డ గ్రామపరిపాలనా అధికారి



**టీ మీడియా ,సెప్టెంబర్ 22, భీమిని:**
భీమిని మండలంలోని పెద్దపేట గ్రామ పరిపాలనా అధికారి దుర్గాప్రసాద్‌ను రూ. 80,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ ఆదిలాబాద్ రేంజ్ విభాగం అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. భూమిన తన పేరుమీదుగా బదిలీ చేసి పట్టా పాస్‌బుక్ ఇప్పించాలని జీపీవో దుర్గాప్రసాద్‌ను బాధితుడు కోరాడు. ఇందుకు రూ. 1,30,000 డిమాండ్ చేశాడు. మొదటి విడతగా రూ. 80,000, పని అయిపోయిన తరువాత మిగతా రూ. 50,000 చెల్లించాలని సూచించాడు.దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బిట్టుపల్లికి చెందిన పోతు రాజేందర్ (33 ఏండ్లు) స్కూటర్‌పై వచ్చిన జీపీవో అధికారి మొదటి విడత డబ్బులను అతడికి ఇవ్వాలని సూచించాడు. దీంతో బాధితుడు డబ్బులను రాజేందర్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడి లంచం డిమాండ్ చేసినందుకు జీపీవో దుర్గా ప్రసాద్‌ను, అతడికి సహకరించిన పోతు రాజేందర్‌ను అరెస్ట్ చేశారు. వీరిని కరీంనగర్‌లోని కోర్టులో హాజరపరచనున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా బాధితుడు పేరును వెల్లడించడం లేదని ఏసీబీ అధికారులు వెల్లడించారు.

# సంస్కృతికి ప్రతీకలుగా కొత్త విమానాశ్రయాలు

(మొదటి పేజీ తరువాయి)
ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మార్పు, వాగుల ప్రవాహాల మళ్లింపు, రహదారుల మార్పు, బీఎస్ఎన్ఎల్ లైన్లు, తాగునీటి సరఫరా పైప్‌లైన్ల మార్పు తదితర అంశాలపై అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.అధికారుల నుంచి పూర్తి వివరాలు తెలుసుకున్న సీఎం.. విమానాశ్రయాల కాంపౌండ్ వాల్ సమీపం నుంచి రహదారులు నిర్మించి, వాటిని జిల్లా, రాష్ట్ర, జాతీయ రహదారులకు అనుసంధానం చేయాలని సూచించారు. విమానాశ్రయాలకు వచ్చే, వెళ్లే రహదారులు విశాలంగా ఉండటంతో పాటు సమీపంలోని ప్రధాన రహదారులతో అనుసంధానమయ్యేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. వివిధ శాఖలు విడివిడిగా పనులు చేపట్టడం వల్ల సమన్వయ లోపంతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని సీఎం పేర్కొన్నారు. విద్యుత్, ఆర్అండ్‌బీ, తాగునీటి సరఫరా, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, బీఎస్ఎన్ఎల్ అధికారులతో కూడా చర్చించాలని సూచించారు. అన్ని పనులను ఏకకాలంలో చేపట్టేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని విమానాశ్రయాల మౌలిక వసతుల ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. వాగులు, ఇతర నీటి ప్రవాహాలను మళ్లించాల్సిన పరిస్థితి ఉంటే.. విమానాశ్రయ ప్రాంగణంలో లేదా సమీపంలో చెరువులను నిర్మించి, అక్కడి నుంచి నీటి ప్రవాహాలను మళ్లించే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు.
అనంతరం ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలతో పాటు ఢిల్లీ తెలంగాణ భవన్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లను సీఎం పరిశీలించారు. ప్రతి నిర్మాణంలోనూ తెలంగాణ సంస్కృతి, శిల్ప, వాస్తు కళలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. డిజైన్లలో పలు మార్పులను కూడా సూచించారు.ఇప్పటికే వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మామునూరు విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణ పూర్తయినట్లు ప్రభుత్వం తెలిపింది.

# ఒకే బస్సు.. రెండు బాధ్యతలు..



**▶▶|బంధం తండ్రీకొడుకులది**

**టీ మీడియా,సెప్టెంబర్ 22, కామారెడ్డి :**

“నాన్నా.. బస్సు ఆపు!” ఆర్టీసీ బస్సులో ఒక్కసారిగా వినిపించిన ఈ మాటతో ప్రయాణికులు కాస్త ఆశ్చర్యపోయారు. సాధారణంగా బస్సులో డ్రైవర్‌ను ‘అన్నా’ అని, ‘అంకుల్’ అని పిలుస్తుంటారు. కానీ ఇక్కడ మాత్రం ఓ వ్యక్తి డ్రైవర్‌ను ఏకంగా ‘నాన్న’ అని పిలవడంతో ప్రయాణికుల్లో ఆసక్తి మొదలైంది. అసలు ఆ డ్రైవర్ ఎవరు? ‘నాన్న’ అని పిలిచింది ఎవరు? అనే సందేహంతో ఆరా తీయగా.. ఆసక్తికరమైన విషయం బయటపడింది.కామారెడ్డి జిల్లాకు చెందిన ఈ ఆర్టీసీ బస్సులో డ్రైవర్, కండక్టర్‌గా పనిచేస్తున్న ఇద్దరూ నిజంగానే తండ్రీకొడుకులు. బోర్లం గ్రామానికి చెందిన గుజ్జరి గంగారం దశాబ్దాలుగా ఆర్టీసీలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా స్టీరింగ్ పట్టుకుని ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడమే తన బాధ్యతగా పనిచేస్తున్నారు. ఇక గంగారం కుమారుడు రంజిత్‌కుమార్ ఇటీవలే ఔట్‌సోర్సింగ్ విధానంలో ఆర్టీసీ కండక్టర్‌గా ఉద్యోగంలో చేరాడు. తండ్రి ఎన్నో ఏళ్లుగా ఆర్టీసీలో పనిచేస్తుండగా.. ఇప్పుడు కొడుకు కూడా అదే సంస్థలో అడుగుపెట్టడం కుటుంబానికి సంతోషాన్ని కలిగించింది. అయితే అసలు ఆసక్తికరమైన విషయం ఇక్కడే జరిగింది. బాన్సువాడ డిపో అధికారులు తండ్రీకొడుకులకు ఒకే బస్సులో డ్యూటీ వేశారు. దీంతో నిజామాబాద్--బాన్సువాడ రూట్‌లో నడిచే బస్సులో తండ్రి డ్రైవర్‌గా స్టీరింగ్ పట్టుకుంటే.. కొడుకు కండక్టర్‌గా ప్రయాణికులకు టికెట్లు ఇస్తూ కనిపించాడు.ఇంట్లో తండ్రి--కొడుకులుగా ఉండే గంగారం, రంజిత్‌కుమార్.. డ్యూటీలో మాత్రం డ్రైవర్--కండక్టర్లుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తండ్రి బస్సును నడుపుతుంటే.. కొడుకు ప్రయాణికుల వద్దకు వెళ్లి టికెట్లు ఇస్తూ, బస్సులో ప్రయాణికుల సౌకర్యాలను చూసుకుంటున్నాడు. ఒకే బస్సులో ఇద్దరూ కలిసి విధులు నిర్వహించడంతో ప్రయాణికులు కూడా ఆసక్తిగా గమనిస్తున్నారు. ఇప్పటివరకు తండ్రి ఆర్టీసీలో తన బాధ్యతను నిర్వర్తిస్తూ కుటుంబాన్ని చూసుకోగా.. ఇప్పుడు అదే సంస్థలో కొడుకు కూడా ఉద్యోగిగా చేరడం మరో ప్రత్యేకత. అంతేకాదు.. తండ్రి డ్రైవర్‌గా, కొడుకు కండక్టర్‌గా ఒకే బస్సులో కలిసి పనిచేసే అవకాశం రావడంతో వారి ప్రయాణం మరింత ప్రత్యేకంగా మారింది.రోజూ బస్సులో ప్రయాణించే వారికి ఇది ఓ సాధారణ ఆర్టీసీ సర్వీసే కావొచ్చు. కానీ గంగారం, రంజిత్‌కుమార్‌కు మాత్రం ఇది తండ్రి--కొడుకుల అనుబంధాన్ని ఉద్యోగ బాధ్యతలతో కలిపిన ఓ మధురమైన ప్రయాణం. స్టీరింగ్‌పై తండ్రి.. ప్రయాణికుల మధ్య కొడుకు.. ఒకే బస్సులో సాగుతున్న ఈ అరుదైన ప్రయాణం ఇప్పుడు పలువురి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇంట్లో తండ్రీకొడుకులు.. డ్యూటీలో డ్రైవర్--కండక్టర్లు.. ఇలా కుటుంబ బంధానికి ఉద్యోగ బాధ్యతలు తోడైన ఈ ప్రయాణం ఆర్టీసీ బస్సులో ఓ మధురమైన జ్ఞాపకంగా నిలిచిపోయింది.

# జీళ్ల చెరువులో గణేష్ నిమజ్జనం



**టీ మీడియా ,సెప్టెంబర్ 22 ,కూసుమంచి:**

గణేష్ నవరాత్రులు ముగించుకొని, జరుగనున్న నిమజ్జన ప్రక్రియ పాలేరు జలాశయం నందు నిషేధించబడింది. జలాశయం నీటిని ప్రజల త్రాగునీటి కొరకు వినియోగిస్తున్నందున, నీటి కలుషితం జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. పాలేరు జలాశయంలో వినాయక నిమజ్జనం చేయడం వల్ల, రసాయన పదార్థాలతో నీటి కలుషితం ఏర్పడి, ప్రజల ఆరోగ్యం కి అనర్థం కలిగే అవకాశం ఉన్నందున, పాలేరు జలాశయంలో గణేష్ నిమజ్జన నిషేధం విధిస్తూ, ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే అధికారులు అందుకు ప్రత్యామ్నాయంగా మండలంలోని జీళ చెరువు గ్రామ చెరువులో గణేష్ నిమజ్జనం జరిపేందుకు ముమ్మరంగా ఏర్పాటు పనులు జరుగుచున్నవి. కూసుమంచి మండలంలోని మొత్తం 41 గ్రామపంచాయతీలో నీ గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు తగు ఏర్పాట్లు చేస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు. చెరువు దగ్గరకు విగ్రహ వాహనాలు, భక్తులు, ప్రజల వెళ్లేందుకు తగు మార్గాల ఏర్పాటు పనులు జరుగుచున్నవి. ప్రోక్లైన్స్, జెసిబి, ట్రాక్టర్ల సహాయంతో రాకపోకలకు ఇబ్బంది కలగకుండా విశాల రహదారులు నిర్మిస్తూ, నేల చదును చేస్తున్నారు.నిమజ్జనం సందర్భంగా భక్తులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు గజ ఈత గాళ్లను ఏర్పాటు చేశారు. గణేష్ నిమజ్జనం ప్రాంతం ప్రాంగణం విద్యుత్ లైట్ల ఏర్పాటు జరుగుచున్నది. పాలేరు రిజర్వాయర్లో వినాయక నిమజ్జనం లేనందున, ప్రతి ఒక్కరు జిల్లాచెరువు నందు నిమజ్జనం చేయాలని అధికారులు సూచించారు. గణేష్ నిమజ్జనం ఏర్పాటు కార్యక్రమంలో తాసిల్దార్ సైదులు, ఎంపీడీవో జస్వంత్ కుమార్, ఎస్సై నాగరాజు, ఇరిగేషన్ డి ఈ చిట్టిబాబు, సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానం కార్యక్రమంలో విషాదం



**▶▶| వేడి సాంబార్‌లో పడి మహిళ మృతి**

**టీ మీడియా,సెప్టెంబర్ 22, విజయవాడ :**

చిట్టినగర్‌లో వినాయచకవితి సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో విషాదం చోటు చేసుకుంది. అన్నదాన ఏర్పాట్లలో భాగంగా పని చేస్తున్న 46 ఏళ్ల సుజాత ప్రమాదవశాత్తు వేడి సాంబార్ ఉన్న గిన్నెలో పడిపోయారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం మృతి చెందారు. ఈ నెల 20న వినాయక చవితి అన్నదాన కార్యక్రమంలో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు.

వైరల్‌గా సీసీటీవీ ఫుటేజ్

మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆమె మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఆ వీడియో ద్వారా ప్రమాదం ఎలా జరిగిందో స్పష్టంగా తెలుస్తోంది. అన్నదాన కార్యక్రమం సందర్భంగా వేడి సాంబార్? గిన్నె తీసుకొస్తున్నప్పుడు సుజాత హఠాత్తుగా బ్యాలెన్స్? కోల్పోయి ఆ గిన్నెలో పడిపోయిన దృశ్యాలు ఆ ఫుటేజ్‌లో కనిపిస్తున్నాయి. వినాయకచవితి పండుగ సందర్భంగా జరిగిన ఈ అనుకోని ప్రమాదం అందరినీ షాక్‌కు గురి చేసింది. స్థానికులు, స్వచ్ఛంద సంస్థలు మృతురాలి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

ఘటనపై కేసు నమోదు

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడలోని కేఎల్‌రావునగర్ ఐదో వీధికి చెందిన మద్ది సుజాత (46) తన చిన్న కుమారుడి వద్ద ఉంటున్నారు. ఈనెల 20న ఇంటి సమీపంలోని వినాయక విగ్రహ నిమజ్జనం నేపథ్యంలో అన్నదానం నిమిత్తం బంధువులతో కలిసి వంటలు చేస్తున్నారు. పొయ్యిపై ఉన్న సాంబారు పాత్రను దింపుతుండగా ప్రమాదవశాత్తు అందులో పడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు : వినాయకచవితి వంటి పండుగల్లో, అన్నదాన కార్యక్రమాల్లో వేడి సాంబార్, పాయసం వంటి వాటిని వండి కిందకి దించేటప్పుడు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద గిన్నెలను నేలమీద కాకుండా స్టాండ్‌లు లేదా ఎత్తైన ప్లాట్‌ఫామ్‌లపై ఉంచాలి. వేడి గిన్నెలను మోసేటప్పుడు ముగ్గురు వ్యక్తులు కలిసి మోయాలి. చేతులకు గ్లోవ్స్, పాదాలకు స్లిప్‌కాని షూలు ధరించాలి. వేడి ప్రాంతం చుట్టూ బారియర్లు ఏర్పాటు చేయాలి. ప్రథమ చికిత్స సామాగ్రి సిద్ధంగా ఉంచాలి. పిల్లలు, వృద్ధులు దగ్గరకు రాకుండా పర్యవేక్షణ చేపట్టాలి. ఈ చర్యలు తీసుకుంటే ఇలాంటి విషాదాలు నివారించవచ్చని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# రైతు లేనిదే రాజ్యం లేదు



**టీ మీడియా ,సెప్టెంబర్ 22 ,ఆత్మకూరు:**

జూరాల ప్రాజెక్టు వద్ద నీళ్లు లేక ఆందోళన చేస్తున్న రైతులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న బీజేపీ నాయకులను ఈరోజు జూరాల ప్రాజెక్టు వద్ద పోలీసులు అడ్డుకుని, అదుపులోకి తీసుకోవడం అప్రజాస్వామికచర్య. రైతుల కష్టాలను తెలుసుకునేందుకు నేడు జూరాల ప్రాజెక్టు సందర్శనకు వస్తున్న రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావ్ ని జడ్చర్ల సమీపంలో అరెస్టు చేయడంలో అడ్డుకోవడం ఏంటి? ఇది ప్రభుత్వ దౌర్జన్యానికి, అధికార మదానికి నిదర్శనం.జూరాల ఆయకట్టు కింద ఉన్నటువంటి రైతుల పక్షాన బిజెపి నిలబడుతుంది. అయ్యగారి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ నాడు జూరాల ప్రాజెక్టు లో పూజలు చేసి మొదటి పంటకు నీరు ఖచ్చితంగా విడుదల చేస్తామని చెప్పి న నాయకులు ఈ రోజు మాట మార్చటం ఎందని ప్రశ్నిస్తున్న. కాంగ్రెస్ ప్రభుత్వ వెంటనే రైతులకు నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని లేకుంటే రాబోయే రోజులలో మరింత ఉధృతం చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమం లో ఆత్మకూర్, అమరచింత మదనాపురం, కొత్తకోట, నర్వ, వనపర్తి నాయకులు రైతులు పాల్గొన్నారు.

# ప్రజలు సుభిక్షంగా ఉండాలి



**▶▶|మంత్రి పొంగులేటి ఆకాంక్ష**

**టీ మీడియా, సెప్టెంబర్ 22 ,కూసుమంచి:**

శ్రీ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో యావత్తు ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖశాంతులు కలిగి, సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం కూసుమంచి మండల లోని నాయకన్ గూడెం, గురువాయిగూడెం, కూసుమంచి గ్రామాలో మంత్రి పొంగులేటి గణేశ్ మహారాజ్ ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ నిర్వాహకులు, భక్తులు మంత్రి కి ఘన స్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగుతూ, పాడి, పంటలతో సస్యశ్యామలంగా విరజిల్లి, ప్రతి కుటుంబం పిల్లాపాపలతో ఆనందోత్సవం కలిగి ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విఘ్నేశ్వర స్వామిని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో కూసుమంచి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శి హఫీజుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు మంకెన వాసు,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జొన్నలగడ్డ రవి కుమార్, మాజీ ఎంపీపీ లు జూకూరి గోపాలరావు, రామసహాయం వెంకటరెడ్డి, బానోత్ శ్రీను నాయక్, మాజీ జడ్పీటీసీ రామ సహాయం బాలకృష్ణారెడ్డి , మాజీ ఎంపిటిసి మాదాసు ఉపేందర్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ వీరభద్రం, బొల్లం పల్లి సుధాకర్ రెడ్డి, అజ్మీర హీరా మాన్ తండా గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అజ్మీర జాను, కంచర్ల జీవన్ రెడ్డి, చాట్ల పరశురాం, కొండ మహిపాల్, బానోతు సత్యం, నాగిరెడ్డి రమేష్ రెడ్డి, కూసుమంచి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు బోడా వీరు నాయక్, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శీనన్న అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్య తీర్చాలి

**▶▶|పంచాయతీ కార్యదర్శికి డీవైఎఫ్ఐ వినతి**

**టీ మీడియా,సెప్టెంబర్22,సింగరేణి(కారేపల్లి):**

కారేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని డీవైఎఫ్ఐ సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి ఆదేర్ల వినయ్‌కుమార్ మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే రహదారులు బురదమయంగా మారుతున్నాయని తెలిపారు.వర్షపు నీరు,మురుగునీరు నిలిచి దోమలు పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి నెలకొందన్నారు.సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని,లేనిపక్షంలో స్థానికులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆదేర్ల నాగరాజు,సాయి,పిట్టల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# 2020 ఢిల్లీ అల్లర్ల కేసు



**● షర్జీల్ ఇమామ్‌కు మధ్యంతర బెయిల్**

**టీ మీడియా,సెప్టెంబర్ 22, ఢిల్లీ బ్యూరో :**
2020 దేశ రాజధాని ఢిల్లీ అల్లర్లకు సంబంధించిన కేసులో నిందితుడిగా ఉన్న షర్జీల్ ఇమామ్?కు ఏడు రోజుల మధ్యంతర బెయిల్?ను మంజూరు చేసింది దిల్లీ కోర్టు. తన ఇద్దరు బంధువుల వివాహ వేడుకలకు హాజరయ్యేందుకు అక్టోబర్ 4 నుంచి 10 వరకు తాత్కాలికంగా విడుదల చేసేందుకు అదనపు సెషన్స్ జడ్జి సమీర్ బజ్‌పాయ్ అనుమతించారు. అయితే, మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు పలు షరతులు విధించింది.షర్జీల్ ఇమామ్ తరఫున న్యాయవాదులు అహ్మద్ ఇబ్రహీం, ఆయేషా జైదీ మధ్యంతర బెయిల్ కోసం దరఖాస్తు చేశారు. తన బంధువులు దానిష్ ఇమామ్, ఫహద్ ఇమామ్ వివాహ వేడుకలకు హాజరు కావాల్సి ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వివాహాల్లో ఒకటి అక్టోబర్ 4న దిల్లీలో, మరొకటి అక్టోబర్ 7న బిహార్‌లోని ససారాంలో జరగనున్నట్లు కోర్టుకు వివరించారు. తొలుత సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 13 వరకు రెండు వారాల మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరినప్పటికీ, కోర్టు ఏడు రోజులపాటు మాత్రమే అనుమతి ఇచ్చింది. రూ.50 వేల బెయిల్ బాండ్‌తో పాటు అదే మొత్తానికి ఒక ష్యూరిటీ సమర్పించాలని ఆదేశించింది. అక్టోబర్ 10 సాయంత్రం జైలు అధికారుల ఎదుట షర్జీల్ ఇమామ్ తిరిగి లొంగిపోవాలని స్పష్టం చేసింది. అలాగే కేసుకు సంబంధించిన వ్యక్తులు లేదా సాక్షులను సంప్రదించకూడదని, సోషల్ మీడియాను ఉపయోగించకూడదని ఆదేశించింది. కుటుంబ సభ్యులు మినహా ఇతరులను కలవకూడదని కూడా షరతు విధించింది. ఇది షర్జీల్ ఇమామ్ దాఖలు చేసిన రెండో మధ్యంతర బెయిల్ పిటిషన్ అని కోర్టు గుర్తించింది. ఈసారి అభ్యర్థన తన సొంత బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు కావడంతో, పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తాత్కాలిక బెయిల్ మంజూరు చేస్తున్నట్లు న్యాయస్థానం పేర్కొంది.

# బిహార్ టీనేజర్ల వేధింపుల కేసు





**● పోలీసుల కాల్పులు**

**టీ మీడియా,సెప్టెంబర్ 22, జముయి :**
కోచింగ్‌కు వెళ్లి వస్తున్న ఇద్దరు టీనేజర్లపై కొందరు దుండగుల జరిపిన దాష్టీకం దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపింది. బిహార్‌లోని జముయి జిల్లాలో జరిగిన ఈ ఘటన ప్రస్తుతం ఆ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే, ఈ కేసులో ప్రధాన నిందితుడైన నందన్ యాదవ్‌ను బిహార్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు.అయితే అరెస్టు చేసే క్రమంలో హైడ్రామా జరిగింది. నిందితుడిని లొంగిపోవాలని కోరగా అతను పోలీసులపై కాల్పులు జరిపాడు. ఈ క్రమంలో పోలీసులు ఆత్మ రక్షణ కోసం ఎదురుకాల్పులు జరిపారు. ఈ ఎన్?కౌంటర్?లో నిందితుడి కాలుకు బుల్లెట్ తగిలింది. అనంతరం అతడిని అరెస్టు చేసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడితో పాటు ఈ కేసులో ప్రమేయం ఉన్న మరో వ్యక్తిని అరెస్టు చేశారు. నందన్ పలు కేసుల్లో నిందితుడని పోలీసు అధికారులు తెలిపారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న మిగతా నిందితుల కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురిని అరెస్టు చేశారకాగా, జముయి జిల్లా మద్వా పహాడ్ ప్రాంతంలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులపై ఓ అల్లరి మూక దాడికి పాల్పడింది. కోచింగ్ క్లాసులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడింది. బాలికను అసభ్యకరంగా తాకుతూ చిత్రహింసలకు గురిచేసింది. ఆమె వెంట ఉన్న బాలుడిని తీవ్రంగా హింసించింది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్? మీడియాలో వైరల్ అయ్యాయి.

# తండ్రి జ్ఞాపకార్థం ప్యూరిఫైయర్ వితరణ



**● మాణిక్యారం పాఠశాలకు అందించిన రవి**

**టీ మీడియా,సెప్టెంబర్22,సింగరేణి(కారేపల్లి):**
తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో సింగరేణి మండలం మాణిక్యారం గ్రామానికి చెందిన కుంచారపు రవి స్థానిక ఉన్నత పాఠశాలకు రూ.25 వేల విలువైన వాటర్ ప్యూరిఫైయర్‌ను మంగళవారం వితరణ చేశారు.తన తండ్రి దివంగత కుంచారపు రంగయ్య జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం రవి ఈ ప్యూరిఫైయర్‌ను అందజేశారు.రవి తల్లి కుంచారపు నాగలక్ష్మి,పెద్దన్నయ్య కుంచారపు జగన్నాథం చేతుల మీదుగా ప్యూరిఫైయర్‌ను ప్రారంభించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు మాట్లాడుతూ విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్యూరిఫైయర్‌ను వితరణ చేసిన కుంచారపు రవిని అభినందించారు.పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనలో దాతలు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు.అనంతరం ఎంఈఓ దుగ్గిరాల జయరాజు,ప్రధానోపాధ్యాయుడు కిషన్,ఉపాధ్యాయులు కలిసి రవి తల్లి నాగలక్ష్మిని శాలువాతో సన్మానించారు.

# గణేష్ మండపాల్లో కర్నాటి క్రిష్ణ పూజలు

**టీ మీడియా ,సెప్టెంబర్ 22, ఖమ్మం:**
ఖమ్మం టౌన్-1 ఏరియాలోని పలు డివిజన్లలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను ఖమ్మం నగర మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కర్నాటి క్రిష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ షాఖ మగ్బుల్ సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు.



ఈ సందర్భంగా కర్నాటి క్రిష్ణ మాట్లాడుతూ.. వినాయక చవితి పర్వదినం ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సమృద్ధిని అందించాలని విఘ్నేశ్వర స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించాలని, ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, కార్పొరేటర్లు పగడాల శ్రీవిద్య, ప్రశాంత లక్ష్మి, ఏరియా నాయకులు షాఖ తాజుద్దీన్, తోడేటి లంగరాజు, మాటేటి కిరణ్, కంచర్ల దయాకర్, సాయికిరణ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మీ ప్రసన్న, సయ్యద్ సాజిద్, సాయికృష్ణ, వీణ షారుక్, సంపటి గణేష్, నల్లగట్ల పుల్లయ్య, చింతల సాంబ, సంపటి గౌతమ్, నయిమ్, తజముల్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

**టీ మీడియా ,సెప్టెంబర్ 22 ,ఖమ్మం:**
తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీ నాయకోటి రాజు ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.ఖమ్మం జిల్లాలోని 21 మండలాలకు చెందిన అధ్యక్షులు, కార్యదర్శులు, ముఖ్య నాయకులు సమావేశానికి హాజరై నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ప్రకటించారు.
నూతన కార్యవర్గం
గౌరవ అధ్యక్షులు: ఎల్లంపల్లి యాదగిరి,జిల్లా అధ్యక్షులు: దొండ దుర్గయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి: ఎస్.డి. రఫీ,
వర్కింగ్ ప్రెసిడెంట్: ఎస్.కె. జానీ మియాకోశాధికారి: గుమ్మడిపల్లి సంతోష్ కుమార్.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ రేషన్ డీలర్లకు గౌరవ వేతనం సాధించేందుకు ఐక్యంగా పనిచేస్తామని




తెలిపారు. డీలర్ల సంక్షేమం కోసం సంఘటితంగా పోరాడుతామని పేర్కొన్నారు.రేషన్ డీలర్ల సమక్షంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కమిటీ మూడు సంవత్సరాల పాటు పదవిలో కొనసాగుతుందని రాష్ట్ర అధ్యక్షులు నాయకోటి రాజు తెలిపారు.

# 3 రోజుల పాటు అతి భారీ వర్షాలు

**● వాతావరణ శాఖ స్పష్టం**

**టీ మీడియా ,సెప్టెంబర్ 22,హైదరాబాద్ బ్యూరో :**
వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో ఇవాళ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఈరోజు 8 జిల్లాలకు అతి భారీ, 20 జిల్లాలకు భారీ వర్ష సూచనలున్నాయని తెలిపింది. ఇవాళ పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు అతి భారీ వర్ష సూచనలున్నాయని చెప్పింది.



ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ
ఉమ్మడి మహబూబ్?నగర్ మినహా మిగతా జిల్లాలకు భారీ వర్ష సూచనలున్నాయి. వాతావరణ శాఖ ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. రాగల 12 గంటల్లో వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారే అవకాశముందని, దీని ప్రభావంతో రేపు, ఎల్లుండి అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు 8 జిల్లాలకు అత్యంత భారీ, 9 జిల్లాలకు అతి భారీ, మిగిలిన అన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని స్పష్టం చేసింది.
ఈ జిల్లాలకు రెడ్ అలెర్ట్
రేపు అత్యంత భారీ వర్షాలు కురిసే పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రేపు అతి భారీ వర్షాలు కురిసే కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, సిద్దిపేట, జనగామ, సూర్యాపేట, నల్గొండ జిల్లలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.
మిగిలిన అన్ని జిల్లాల్లో భారీ వర్షాలు
ఈ నెల 24న రాష్ట్రంలోని 10 జిల్లాలకు అత్యంత భారీ, 10 జిల్లాలకు అతి భారీ, మిగిలిన అన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. అత్యంత భారీ వర్షాలతో కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, కరీంనగర్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.
60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు
రేపు అతి భారీ వర్షాలతో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, జనగామ, సూర్యాపేట, ఖమ్మం, నల్గొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్? జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

# మత్తుకు బానిసైతే భవిష్యత్తు అంధకారమే

**● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డి**

**టీ మీడియా,సెప్టెంబర్22,సింగరేణి(కారేపల్లి):**
మత్తు పదార్థాలకు ఒక్కసారి బానిసైతే ఆరోగ్యంతో పాటు చదువు,కుటుంబం,భవిష్యత్తు మొత్తం దెబ్బతింటుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఖమ్మం డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డి హెచ్చరించారు.విద్యార్థులు మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కాకుండా చిన్ననాటి నుంచే వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జడ్పీహెచ్ఎస్ కారేపల్లిలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డి విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల ఎదురయ్యే ప్రమాదాలను వివరించారు.ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ క్షణిక ఆనందం కోసం మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాంతం మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. మద్యం,గంజాయి,ఇతర




మాదకద్రవ్యాలు శారీరక,మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు వ్యక్తి ఆలోచనా శక్తిని దెబ్బతీస్తాయని తెలిపారు.ముఖ్యంగా విద్యార్థులు చెడు స్నేహాలు,ప్రలోభాలకు లోనుకాకుండా లక్ష్యంపై దృష్టి పెట్టాలని సూచించారు.యువత మత్తుకు బానిసైతే ఆ ప్రభావం ఒక్క వ్యక్తికే పరిమితం కాదని,కుటుంబంతో పాటు సమాజంపైనా పడుతుందని సోమిరెడ్డి పేర్కొన్నారు.విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటమే కాకుండా తమ స్నేహితులు కూడా వాటి బారిన పడకుండా అవగాహన కల్పించాలని కోరారు.మత్తు రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సింగరేణి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.లింగయ్య,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. షోడోమన్ రాజు,ఉపాధ్యాయులు సీహెచ్ శ్రీలత,పి.శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే ఆరోగ్య,సామాజిక దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.